క్లుప్తంగా

రూ.5 లక్షల వైఎస్సార్ బీమా అందజేత



లీలావతికి రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామ సచివాలయం పరిధిలోని కొత్తకోట అప్పారావు ఇటీవల పాము కాటుతో ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ ప్రమాద బీమా రూ.5 లక్షలు మంజూరైంది. ఈ చెక్కును మృతుని భార్య లీలావతికి ఫరీదుపేట గ్రామ సచివాలయం వద్ద ఎంపీపీ మొదలవలస చిరంజీవి సోమవారం అందజేశారు. సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తారు గోపి, పైడి కిరణ్, కూన కిరణ్, సంక్షేమ సహాయకులు గోవింద్ ఉన్నారు.

ఇంటింటికీ 'ఆడుదాం ఆంధ్ర' బ్రోచర్లు పంపిణీ



బ్రోచర్ల పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

గార: ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ప్రతీ ఇంటికీ అందించాలని మండల ప్రత్యేకాధికారి బి.వెంకటరమణ సూచించారు. తోనంగిలో జరుగుతున్న పంపిణీని ఆయన సోమవారం పరిశీలించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని..ఆసక్తి ఉన్నవారు సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీవో సంజీవ రమణయ్య ఉన్నారు.

సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల, లావేరు: లావేరు మండలంలోని మురపాక గ్రామంలోని పలు ప్రధాన వీధుల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలను చేపడుతున్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సహకారంతో గడపగడపకు నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు తెలిపారు.

పరామర్శ..



మామిడి శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: రాష్ట్ర తూర్పుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ తన ఇంట్లో కాలుజారిపడి గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శ్రీకాకుళంలోని శ్రీకాంత్ స్వగృహానికి సోమవారం వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో రణస్థలం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు రెడ్డి విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు నవీన్ మణికంఠ



బహుమతి అందుకుంటున్న నవీన్‌మణికంఠ

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి రోడ్‌లో ఉన్న శార్వాణి పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వాంగ్రంగి నవీన్ మణికంఠ రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోకాలాపన పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఈనెల 17వ తేదీన ఒంగోలు వేదికగా జరగనున్నాయి. పీఎన్‌కాలనీలోని నారాయణ తిరుమలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత శ్లోకాలాపన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రపోటీలకు నవీన్ మణికంఠ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేఖ సోమవారం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై శర్వాణి అధినేత, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, స్కూల్ డైరెక్టర్ ఎ.ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ సత్యవాణి అభినందించారు.

శంభో శంకరా..

కార్తీక మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో శివుడికి అభిషేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలన్నీ శివనామస్మరణతో మారుమ్రోగాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళం గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



శ్రీకాకుళం రూరల్: ఇప్పిలిలో ఉమాపిప్పిలేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రకోటేశ్వరునికి హారతి



శ్రీకాకుళం కల్చరల్:కోటేశ్వరాలయ గర్భగుడిలో భక్తులు



శ్రీకాకుళం కల్చరల్:నాగావళి నదిలో దీపాలు విడిచిపెడుతున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్:బలగలో ఉత్తరేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు



రణస్థలం: బంటుపల్లి ఎండలమల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎచ్చెర్ల: లావేరు మండలం తామాడ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జి.సిగడాం: సంతవురిటిలో ఏర్పాటు చేసిన నారాయణ సేవలో పాల్గొన్న భక్తులు

ఘంటసాలకు ఘనంగా నివాళులు



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఉన్న ఘంటసాల విగ్రహానికి ఆయన 101వ జయంతి సందర్భంగా ఘంటసాల ఆరాధన కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ నిక్కు అప్పన్నలు ఘంటసాల విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం మాట్లాడుతూ తుపాను కారణంగా సోమవారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో బండారు రమణమూర్తి, నిక్కు హరిసత్యన్నారాయణ, రామలింగస్వామి, ఎం.వి.కామేశ్వరరావు, డాక్టర్ ధర్మాన లక్ష్మీనారాయణ, సూర్యప్రసాదరావు, కె.ఎల్.ఎన్.మూర్తి, మల్లెమొగ్గల రాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి పరామర్శ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దమ్మలవీధికి చెందిన నాయన కనకమహాలక్ష్మి ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇటీవల కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు సోమవారం పరామర్శించారు. అధికారులతో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం అందించాలని సూచించారు.

• కార్తీక దీపారాధనలు

బలగ బుచ్చిపేటలో ఉన్న రామాలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా సోమవారం దీపారాధనలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు శివలింగం, శంకు, చక్రం, ఓం ఆకారాలలో దీపాలు వెలిగించారు.

శ్రీకాకుళం కల్చరల్



కాంగ్రెస్ విజయంపై హర్షం

శ్రీకాకుళం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభంజనం లేదన్నారు. నాయకులు దేశళ్ల గోవింద మల్లిబాబు, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రమేష్ కుమార్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం: మాట్లాడుతున్న కృష్ణారావు

6న ఆశీల్ల వసూళ్లకు బహిరంగ వేగం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో మార్కెట్ అండ్ రోడ్డు మార్జిన్లలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశీళ్లను వసూలు చేసే నిమిత్తం ఏజెన్సీ ఎంపికకు ఈ నెల ఆరో తేది ఉదయం 10.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ చల్ల ఓబులేసు సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ. 10 లక్షలు సాల్వెన్సీ, రూ. 3 లక్షలు ధరావత్తు చెల్లించాలన్నారు. ఎక్కువకు పాడుకున్నవారికి మార్కెట్ అండ్ రోడ్స్ మార్జిన్స్‌లలో ఏడు విలీన పంచాయతీలతో సహా 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వ వరకు ఆశీలు వసూలు చేసుకునే హక్కు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో రెవెన్యూ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

కళాకారుడు మోహనరావుకు సత్కారం



మోహనరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన పౌరాణిక హార్మోనియం కళాకారులు బీపీ మోహనరావుకు తణుకులోని షణ్ముఖ ఆంజనేయరాజు కళాపీఠం సభ్యులు ఆదివారం సత్కరించారు. షణ్ముఖ ఆంజనేయరాజు 95వ జయంతి సందర్భంగా జరిగిన సభలో ఈ సత్కారం జరిగింది. ప్రముఖ సినీ గీత రచయిత రసరాజు, శశి విద్యాసంస్థల అధినేత సత్యన్నారాయణ రాజులు కళాకారులను సత్కరించారు.

'ఆడుదాం ఆంధ్ర' పోస్టర్ ఆవిష్కరణ



ఆడుదాం ఆంధ్రా క్రీడల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాయికుమార్

రణస్థలం: ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలతోపాటు మారథన్, యోగా, టెన్నికాయట్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 15 ఏళ్లకు పైబడిన క్రీడాకారులంతా గ్రామ సచివాలయంలో, గ్రామ వలంటీర్లు, వెబ్‌సైట్, 1902కి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, ఏట ధనుంజరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు కిల్లారి రమణ, నాయకులు చినరామినాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, కలిశెట్టి కన్నంనాయుడు, దన్నాన హరి, మహంతి సత్యనారాయణ, కెల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గార: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

గార: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించగలిగామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. కొర్లాం సచివాలయం వద్ద ఎంపీపీ గొండు రఘురామ్ ఆధ్వర్యంలో సోమవారం ' వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతమైందన్నారు.
కుల, మత, ప్రాంత భేదం లేకుండా అర్హులందరికీ అందించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇటువంటి ప్రభుత్వం ఏర్పడలేదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, సర్పంచ్ పీస శ్రీహరిరావు, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, మార్పు పృథ్వీరాజ్, ఈవోపీఆర్‌డీ పి.శ్రీనివాసరావు, గుజ్జల అప్పలరాజు అన్నారు.

ఓబీసీ సాధనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మండల కమిషన్ నివేదికను పునర్ సమీక్షించి త్వరితగతిన శిష్టకరణాలను కేంద్ర బీసీ జాబితాలో చేర్పించుటకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం రాజమండ్రిలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వెనుకబడిన శిష్టకరణాల స్థితిగతులను జాతీయ బీసీ కమిషన్ సమీక్షించిందన్నారు. అందుకు సంబంధించిన నివేదిక కేంద్ర న్యాయశాఖ ముందుకు పంపించేందుకు సహకరించిన పార్లమెంట్ సభ్యులను అభినందిస్తూ తీర్మానం చేశారు. ఏపీలో మైనారిటీ కులమైన శిష్టకరణాలను పార్లమెంట్‌లో బిల్ ఆమోదం చేసి బీసీ సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బొమ్మారు శ్రీను, సాయిబాబా గజపతిరావు, శ్రీనివాసరావు, ఎ.రాజా, బి.ఎస్.కె.పట్నాయక్ పాల్గొన్నారు.

తీరంలో అధికారుల పర్యటన



ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేట వద్ద అలల ఉధృతి



ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేట వద్ద ఒడ్డుకు చేర్చిన బోట్లు

గార: తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి బి.వెంకటరమణ అన్నారు. తీరప్రాంత గ్రామాలైన బందరువానిపేట, కళింగపట్నం, తోనంగి, మొగదాలపాడు తదితర ప్రాంతాల్లో తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీవో సంజీవ రమణయ్యలతో కలిసి సోమవారం పర్యటించారు. మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో దండోరా వేసేంతవరకు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దన్నారు. వ్యవసాయ శాఖ, వలంటీర్ల ద్వారా గత మూడు రోజులుగా సూచనలు అందించడంతో రైతులు అప్రమత్తమయ్యారన్నారు. తోనంగిలోని తడిచిన వరి పనలను పరిశీలించారు. తీర ప్రాంతాల్లో మత్స్యశాఖ ఎఫ్‌డీవో బగాది సురేష్‌కుమార్, వీఎస్‌ఏ హేమసుందర్‌లు కూడా పర్యటించారు.

మిచాంగ్ పట్ల అప్రమత్తం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో మిచాంగ్ తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తం చేశారు. సముద్ర తీరంలోని డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం, నదీతీరంలోని పొన్నాడ, బొంతల కోడూరు తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించారు. సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తహసీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. సముద్రంలో అలలు తాకిడికి ఒడ్డుపై చేపల వేట బోట్లు భద్రపర్చారు. కోత దశకు వచ్చిన వరి పంట, కోసిన వరి పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు ఉన్నారు. ఇబ్రహింబాద్, ఫరీదుపేట, పూడివలస, కుశాలపురం, తోటపాలెం, కొత్తపేట, ధర్మవరం తదితర గ్రామాల్లోపా రైతులు పంటలను కాపాడేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పొలాల్లో నీరు చేరకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ వేణుగోపాలరావు వెల్లడి

జి.సిగడాం: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులు వరి పంటను జాగ్రతంగా భద్రపర్చుకోవాలన్నారు. వర్షాల కారణంగా వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్ఓలు పాల్గొన్నారు.



జి.సిగడాం మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాలరావు



గార: బందరువానిపేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటరమణ



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం వద్ద పొలంలో ఉన్న వరి పనలు



ఎచ్చెర్ల క్యాంపస్: పైడివలసలో వరి దిబ్బలపై కప్పిన టార్పాలిన్లు



ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో వరి కుప్పలు

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

• తుఫాన్ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిషనర్ చల్ల ఓబులేసు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. అత్యవసరమైన వారు 08942–229080 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే మంచినీటి సరఫరాకు ఆటంకం లేకుండా ఉండేందుకు జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోతే వెంటనే తొలగించడానికి ఆయిల్ ఇంజన్లను, గాలులకు చెట్లు పడిపోతే వాటిని తొలగించడానికి మెకనైజ్డ్ రంపాలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆశ్రయం కల్పించేందుకు కార్పొరేషన్ పరిధిలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. సమాచార సహాయ కేంద్రాల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జూనియర్ అసిస్టెంట్లు కె.శ్రీను (80087 12492), టి.రామశాస్త్రి (92935 02885) మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి పది గంటల వరకు, కె.లీలామోహన్ (90109 80890) సీనియర్ అసిస్టెంట్ జాక వెంకటమోహనరావు (96766 07027) అందుబాటులో ఉంటారని.. అవసరమైతే వీరిని సంప్రదించాలని సూచించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

జి.సిగడాం: గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజలు సహకరించాలని సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు. పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అవసరమైన చోట ఉపాధి పనులను గుర్తించాలన్నారు.